క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా శనివారం గ్రామంలో ఉన్న శ్రీకోదండ రామాలయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా వెళ్లి శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని లక్ష్మీదేవికి సారె సమర్పించారు. ఆలయంలో అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



నవాబుపేట(పెనుగంచిప్రోలు): డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గింజుపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక సొసైటీలో శనివారం ఆరు డ్వాక్రా గ్రూపులకు రూ.82 లక్షల రుణాల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలన్నారు. మహిళలకు రుణ పరిమితి పెరిగినందున ప్రతి నెలా 5వ తేదీ లోపు వాయిదాలు చెల్లించి పావలా వడ్డీకి అర్హులు కావాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.దుర్గాప్రసాద్, సంఘ కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గింజుపల్లి మధు పాల్గొన్నారు.

ఎంఈవో 1 గా వెంకటరత్నం



వత్సవాయి: మండల విద్యాశాఖాధికారి -1 గా ఆదూరి వెంకటరత్నం శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘ యూనియన్ నేతలు వచ్చి ఎంఈవోకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, దానికనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేసి పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పీడీవీ ప్రసాదరావు, భువనేష్, గోవిందరాజులు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా పలు ఆలయాల్లో శని త్రయోదశి సందర్భంగా శనికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. శనివారం, అమావాస్య ముందు త్రయోదశి కలిసి రావటంతో ప్రత్యేక పూజల కోసం వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, రామలింగేశ్వర్ నగర్‌లోని అయ్యప్ప స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని శనైశ్వరునికి విగ్రహం వద్ద, గాంధీనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపం వద్ద శనికి ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. పట్టణ శివారు పల్లగిరి కొండపై ఉన్న నవగ్రహ మండపం వద్ద, దాములూరు కూడలి, సోమవరం, గోళ్ళమూడి, మాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో గల నవగ్రహ మండపాల వద్ద శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

31లోగా డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేయాలి

నందిగామ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు ఈనెల చివరి వరకు మాత్రమే సమయం ఉందని నందిగామ కోఆర్డినేటర్ ఏలూరి పిచ్చేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలు పొందాలనుకునే వారు జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 73829 29685 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

జగ్గయ్యపేటఅర్బన్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేయాలని కోరారు.అమ్మ ఒడి పథకాన్ని విద్యార్థులందరికీ ఇవ్వాలని, కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పేట మండల అధ్యక్షుడు రాజు, మండల నాయకులు వెంకట్, భరత్, అజయ్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



బండిపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన విప్ ఉదయభాను, పక్కన ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, దేవినేని అవినాష్ తదితరులు

బండిపాలెం(జగ్గయ్యపేట): టీడీపీ భూస్థాపిత మయ్యే రోజు దగ్గరలోనే ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో రూ.55 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, జగనన్న పాలవెల్లువ భవనాలను ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్‌లతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కాసరగడ్డ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉదయభాను మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతుంటే ప్రతిపక్ష టీడీపీ మాత్రం ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలను అవలంబిస్తోందన్నారు. టీడీపీకి రానున్నకాలంలో డిపాజిట్లు కూడా దక్కేలా లేవన్నారు. గ్రామాల్లో అభివృద్ధి అంటే ఏమిటో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. ఏపీఐడీసీ చైర్ పర్సన్ పుణ్యశీల మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సీఎం జగన్ అనితర కృషి చేస్తున్నారని అన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ ఎలీశమ్మ, సచివాలయ కన్వీనర్‌లు బండి వీరబ్రహ్మం, సీతమ్మ, ఏఎంసీ డైరెక్టర్ సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు చైతన్య, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కుంచపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎద్దుల బండి

ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, విజయవాడ తూర్పు సమన్వయకర్త దేవినేని అవినాష్‌లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ రంగులతో ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై తీన్‌మార్ వాయిద్యాలు, యువత కేరింతల నడుమ గ్రామంలో భారీ ర్యాలీ చేశారు.



మహిళలకు రుణాల చెక్కులు అందజేస్తున్న విప్ ఉదయభాను, పుణ్యశీల

బండిపాలెంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.2 కోట్ల లబ్ధి

బండిపాలెం(జగ్గయ్యపేట):వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నాలుగున్నరేళ్లలో బండిపాలెం గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.2 కోట్ల మేరకు లబ్ధి జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో శనివారం జగనన్న సురక్ష క్యాంపులను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల అభివృద్ధి చేశారన్నారు. టీడీపీ హయాంలో గ్రామంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి, సంక్షేమం అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కావాలో లేక చంద్రబాబు మోసపూరిత ప్రభుత్వం కావాలో ఆలోచించుకోవాలన్నారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం గ్రామంలో 800 మందికి వివిధ రకాల సర్టిఫికెట్‌లను ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ పుణ్యశీలతో కలిసి ఉదయభాను అందజేశారు.

రూ.1.02 కోట్ల రుణాలు అందజేత

గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా మంజూరైన రూ.1.02 కోట్ల రుణాల చెక్కులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ చిన్నారావు, సొసైటీ అధ్యక్షుడు కాసరగడ్డ రామారావు, సచివాలయ కన్వీనర్‌లు వీరబ్రహ్మం, శేషయ్య, కాసరగడ్డ కిరణ్, మధు, రంజిత్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుశీల, మండల కన్వీనర్‌లు మండవ శ్రీనివాస గౌడ్, సీతామహాలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులు

జగనన్న సురక్షలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న మంచిని ప్రజలు గమనించాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చౌటపల్లి, చట్టన్నవరం గ్రామాల పరిధిలోని చౌటపల్లి సచివాలయంలో అధికారులు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జగనన్న సురక్ష క్యాంపులు ప్రజా సమస్యల పరిష్కారంలో సత్ఫలితాలనిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పని తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల పాలనకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకుని మంచి చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, చలమల దుర్గయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు మార్తమ్మ, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చౌటపల్లిలో జగనన్న సురక్షలో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పండుగ వాతావరణంలో జగనన్న సురక్ష

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నిరుపేదల చిరునవ్వుల మధ్య జగనన్న సురక్ష క్యాంపులు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కంచల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాభావంతో నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్‌లపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు బాధాకరమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్‌లు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, గ్రామ కన్వీనర్ చలమల మధు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పాలన

- ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్‌కుమార్
- కంచికచర్ల, పెండ్యాలలో జగనన్న సురక్ష గ్రామ సభలు



కంచికచర్లలో లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

కంచికచర్ల/పెండ్యాల(కంచికచర్ల): నిత్యం మీ ఇంటి తలుపు తట్టి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పరితపిస్తున్న గ్రామ స్వరాజ్య పాలన కోసం పరితపిస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెండ్యాల-1 కంచికచర్ల గ్రామ సచివాలయం-2 పరిధిలో శనివారం పెండ్యాలలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కంచికచర్లలో సర్పంచి వేల్పుల సునీత అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే తపనతో జవాబుదారీతనంతో ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, మాడుగుల మధుబాబు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, తహసీల్దార్ శంకరబాబు, వలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి జగనన్న సురక్ష

జగ్గయ్యపేటఅర్బన్: అర్హులై ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారికి కూడా లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని కోదాడ రోడ్‌లోని టీవీఎస్ షోరూం పక్కన శనివారం సాయంత్రం మైహోం అపార్ట్‌మెంట్స్ వద్ద జరిగిన 14 వ సచివాలయం, చెరువు బజారులోని రేణుక పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన 6 వ సచివాలయం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ పరిధిలో సత్యనారాయణపురం మీదుగా హైవే వరకు రహదారి, మార్కెట్ యార్డు వద్ద నుంచి హైవే వరకు విశాలమైన రహదారి ఏర్పాటుచేస్తున్నామన్నారు. హైవే బస్టాండ్ నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా పట్టణంలోని చెరువు బజారు అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే తాతయ్య అని ఎమ్మెల్యే ఉదయభాను ఆరోపించారు. నేడు చెరువు బజారులో సీసీ రోడ్లు నిర్మించామని, చెరువు అలుగు వద్ద వంతెన నిర్మించామని, కోట్లాది రూపాయల వ్యయంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, దుర్గ గుడి డైరెక్టరు నంబూరి రవి తదితరులు పాల్గొన్నారు.



పేటలో జగనన్న సురక్ష క్యాంపులో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న విప్ ఉదయభాను

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాలి

మక్కపేట(వత్సవాయి): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాలని ఎంపీపీ కొలుసు రమాదేవి తెలిపారు. సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు గృహ సారథులు ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యను తెలుసుకుని సురక్ష కార్యక్రమంలో వాటికి పరిష్కారం చూపిస్తున్నారన్నారు. ఇంతటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, తహసీల్దార్ వైకుంఠరావు, ఈవోపీఆర్డీ మాధవి, సర్పంచ్ గుడేటి శారమ్మ , సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల రమేష్ , పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్ పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

జగ్గయ్యపేటఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 16 వ తేదీన స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవన్‌లో జరగనుందని నూతన అధ్యక్షుడు రాజా కేశవప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యవర్గం నూతన అధ్యక్షునిగా డాక్టర్ రాజా కేశవప్రసాద్, కార్యదర్శిగా పి.కృష్ణమూర్తి, కోశాధికారిగా కరుణాకరరావు, రీజియన్ చైర్మన్‌గా కె.మోహన్‌బాబు, జోన్ చైర్మన్‌గా నారాయణరెడ్డి, రీజియన్ కార్యదర్శి, జిల్లా అడిషనల్ కోశాధికారిగా ఎస్‌ఏ ఖాసిం సైదా, సర్వీస్ చైర్‌పర్సన్‌గా ఎస్.బదరీనారాయణ, క్లబ్ అడ్మినిస్ట్రేట్‌గా ఎస్‌వీ సత్యనారాయణ, మార్కెటింగ్ చైర్మన్‌గా బి.రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

17 న ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్ వారు ఈనెల 17 వ తేదీన తమ స్టేషన్‌లో వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 24 వాహనాలకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వాటిలో 20 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం ఉన్నాయని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఆటోలకు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5 వేలు, ద్విచక్ర వాహనాలకు రూ.3 వేల చొప్పున ధరావత్తు చెల్లించాలని, వివరాలకు 94409 02461, 95022 58678 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

పెనుగంచిప్రోలు:అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ ఉద్దేశమని తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి అన్నారు. శనివారం మండలంలోని ముచ్చింతాల గ్రామంలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, శనగపాడు గ్రామంలో సర్పంచ్ కీసర సైదులు అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కీసర లోకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని సంతకాల సేకరణ

జగ్గయ్యపేటఅర్బన్: విలియంపేట సమీపంలోని ముక్త్యాల రోడ్‌లో పురపాలక సంఘం వారు ఏర్పాటుచేసిన చెత్త డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని కోరుతూ శనివారం సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్త్యాల రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి హానికరంగా మారిన చెత్త డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు సీఎం కృషి

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



గోకరాజుపల్లిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గోకరాజుపల్లి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణ మహిళలకు సైతం సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. గత ప్రభుత పాలనలో గ్రామీణ ప్రాంతాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు తదితర అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారు

జగనన్న సురక్షలో ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామ జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామటౌన్: తాము అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనిచేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నేతలు కోర్టులను ఆశ్రయించి అడ్డుకుంటున్నారని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ అన్నారు. పట్టణంలోని 11,12 వార్డుల పరిధిలో సచివాలయం-6లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందిగామ అభివృద్ధికి దశ, దిశ చూపిన దివంగత నేత మాజీ మంత్రి దేవినేని వెంకటరమణ తరువాత ఆ స్థాయిలో నందిగామను అభివృద్ధి పథంలో నడిపింది శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాత్రమేనన్నారు. రమణ తరువాత ఏళ్ల తరబడి టీడీపీ అధికారంలో ఉన్నా నందిగామకు ఒరిగిందేమీ లేదన్నారు. నియోజకవర్గానికి తలమానికమైన గాంధీ సెంటర్‌ను అభివృద్ధి చేస్తుంటే టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోర్టుకెళ్లి స్టే తీసుకువచ్చి పనులను అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు షేక్ రసూల్, కోమటి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ జయరాం, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేసే క్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే ఇంటింటి ఓటర్ సర్వే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి ఓటరు జాబితాను పరిశీలించి ఆ తర్వాత సమర్థమైన ఓటరు జాబితా సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు.

డాక్టర్ కేఎల్ రావు సేవలు చిరస్మరణీయం



డాక్టర్ కేఎల్ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు, విద్యార్థులు

మైలవరం: తెలుగు జాతి గర్వించదగ్గ సివిల్ ఇంజినీర్ డాక్టర్ కే.ఎల్.రావు చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దివంగత ఇంజినీర్ డాక్టర్ కే.ఎల్. రావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వద్ద ఉన్న డాక్టర్ కే.ఎల్. రావు విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ కే.ఎల్. రావు నిర్ణయాల వలన నాగార్జున సాగర్, పులిచింతల వంటి బహుళార్థసాధక ప్రాజెక్టులు రూపకల్పన జరిగిందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఆయా రంగాలలో నిష్ణాతులుగా తయారవ్వాలన్నారు. విద్యతో పాటు నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఆఫీసర్ శీలం ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

నందిగామటౌన్: వైద్యరంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనితర కృషి చేస్తున్నారని, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది కూడా అందుకనుగుణంగా పనిచేయాలన్నారు. ఆస్పత్రి వార్డులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తాగునీటితో పాటు రోగులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ సాంబశివరావు, సూపరింటెండెంట్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామ: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రామలింగేశ్వర నగర్, చందాపురం రోడ్డు, రైతు పేట డౌన్, కృష్ణబలిజ నగర్, ముక్కపాటి కాలనీ ప్రాంతాలతో పాటు మండలంలోని చందాపురం, ఐతవరం గ్రామాల పరిధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

80 మందికి నేత్ర పరీక్షలు

కన్నెవీడు(వత్సవాయి): సిద్ధార్థ కంటి వైద్యశాల, కొమరగిరి ట్రస్టు, శ్రీ సాయి సెంచరీ హైస్కూల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని సర్పంచ్ చావా దుర్గారాణి ప్రారంభించారు. మొత్తం 80 మంది శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించుకోగా వారిలో 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వెంటనే వారిని వైద్యశాలకు చెందిన ప్రత్యేక వాహనంలో ఆపరేషన్ల కోసం తరలించారు. వైద్యశాల పీఆర్‌ఓ రాఘవ, ట్రస్టు ప్రతినిధి కొమరగిరి సవితా భరద్వాజ్, హెచ్ఎం అజ్మీరు కొండ తదితరులు పాల్గొన్నారు.